# మమ్మల్ని ఓ కంట కనిపెట్టండి బాబూ

వెనక పార్లమెంట్ ఎలక్షన్లప్పుడు నాకు తెలిసినాయన మా వూరి పేరుమీద వున్న నియోజక వర్గానికి నిలబడ్డాడు. "చెప్పవయ్యా, మనకి వోట్లుపడే ప్రాంతాలు నీ దృష్టిలో యామన్నా వుంటేను!" అని ఆ అభ్యర్థి నన్ను అభ్యర్థించాడు. "నీకు పేదలూ, దళిత వర్గాలూ అంటే విపరీతమైన సానుభూతి కదా. వాళ్ళుండే ప్రదేశాలూ, ప్రాంతాలూ నీకు తెలియకుండా వుంటాయా? అయినా అడిగేవు కనుక చెబుతున్నాను. ఏటి తోటవెళ్తే నోట్లవర్షం లేకుండానే నీకు ఓట్ల వర్షం కురుస్తుంది" అని చెప్పాను.

చాలాకాలం కిందట వెళుతూ వుండే వుండేవాడుట ఆయన అక్కడికి. అంటే వాళ్ళమ్మా, నాన్నా అతను యువకుడైనాడని గుర్తుపట్టక పూర్వం; అతనికి వివాహాది 'కార్య'క్రమాలు జరక్క ముందు. 'సుఖాల' మాటున కష్టాలు వుంటాయని అతను తెలుసు కున్నది. అక్కడి జనాల వల్లనేట. ఆ సంగతి చూచాయగా చెప్పాడు. "ఇప్పుడు వెళ్ళేది ఆ పనిమీద కాదుకదా" అని ధైర్యం చెప్పగా, "అప్పటి వాళ్ళు ఇప్పుడు వుండరు. నన్నెవరూ గుర్తుపట్టరు" అని వేషం సరిచూసుకుని, వెళ్ళి రోజూ ముమ్మరంగా ప్రచారం చేసుకుని, వాళ్ళు అడిగింది ఇచ్చేసి గెల్చుకున్నాడు చివరికి.

ఏటి తోట ప్రజలంతా ఊరవతల నీరింకిన చెరువు పక్క చెట్టు కింద కుండలతో, గోనెలతో ఎటుచూస్తే అటు చీకటిలో గడిపే వర్గాలూ, పేద ప్రజానీకమూనూ, స్లమ్‌క్లియరెన్సు అనే పేరిట ఆ తోట ఖాళీ చేయించి వాళ్ళని శుభ్రమైన చోట్లకి, మంచి యిళ్ళల్లోకి పునరావాసం చేయిద్దామని అయిదేళ్ళకోసారి ప్రభుత్వ ప్రతినిధులు వేదికలమీద తల(లు) పెడుతూ వుంటారు. కాని ఏమీ అవదు. వాళ్ళ

అక్కడే వుంటున్నారు; వుంటారు కూడాను. ఎవరైనా పెద్దలు వాళ్ళ పేటకి వస్తే మమ్మల్నో కంట కనిపెట్టండి బాబూ అంటూ వీళ్లేదో ఆరుస్తారని, వాళ్ళేదో అరుస్తారు.

సింహాచలం, అప్పారావు, అప్పలస్వామి, సూర్రావు, తవిటయ్య, బుట్టయ్య ఆ పేటలో నాకు డాక్టర్ సూర్యం ద్వారా తెలిసిన కొందరు. వాళ్ల సూర్యం దగ్గిరికి తెచ్చే పేషంట్లంతా ఏక్సిడెంట్లలో చిక్కుకున్న మగాళ్లు, సుఖరోగాల్తో కుళ్ళిన ఆడవాళ్ళూనూ, "ఇదేంటయ్యా ఇలాంటిచోట పెట్టావు ప్రాక్టీసూ" అంటే, "పోష్ లొకాలిటీస్‌లో కన్సల్టేషన్ ఫీజు ఐదు రూపాయలంటే రోజుకి నలుగురు రావడం కష్టం. ఇక్కడ రూపాయి పెట్టాను. రోజుకి వందమంది వస్తున్నారు" అన్నాడు. కొన్నాళ్ళదాకా అలా సాగి, రానురాను ఈ పేట నాయకులు "మావోడే డాక్టరు బాబూ, సూసి పంపు" అనడం అలవాటు కావడంతో. బోర్డుతీసి అక్కడినుంచి వెళ్ళిపోయాడు, డాక్టర్ సూర్యం.

ఓసారి కమలాకరానికి సిమెంటు పర్మిట్ వస్తే, బస్తాలు లారీకెత్తించుకుని వెళుతూ వుండగా మెరుపు వీరుల్లా నడుస్తున్న లారీ ఎక్కి అయిదారు బస్తాలు దింపేసుకుని గుప్‌చిప్‌గా దిగిపోయారుట. అడ్డం రాబోయిన డ్రైవర్ని చితక్కొట్టి వదిలారుట. నేను నమ్మలేదనుకోండి——

పది రోజుల కిందట కృష్ణారావు తను కొత్తగా పెడుతున్న ఫర్నిచర్ షాపుకి కావలసిన కలప లారీలో తెస్తూ వుంటే చిన్న తగువుతో లారీ కడ్డంగా నిలబడి వాళ్ళలో వాళ్ల కొట్టుకున్నట్టు నటించి, లారీ ఆగగానే వెనకనుంచి యెక్కి రెండు దుంగలు దింపేశారని, పోలీసుల్ని పిల్చుకొచ్చే లోపల చకచక అదంతా వంటచెరకుగా తెగగొట్టి పంచేసుకున్నారని, వాళ్ళమీద అభాండం వేసేడు. "వాళ్ళంతా పేదలు. కష్టపడి పని చేస్తారు. పని దొరక్కపోతే అడుక్కుంటారు. అంతేకాని, దోపిడీలు చెయ్యరు" అని నేను కృష్ణారావుని కేకలేశాను.

నిన్న మధ్యాహ్నం రెండు గంటలకి; వెంకట్రామయ్యగారు

సొంత లారీలో తాడేపల్లి గూడెం నుంచి బియ్యం తెచ్చుకుంటూ ఆ పేట పక్కనుంచి వస్తున్నాడు. (బస్సు దొరక్క నిలబడ్డ నేను ఆయన పిలిస్తే అందులో ఎక్కాను)

లారీ ఆ పేట నడిమధ్యకి రాగానే ఒక ఇరవైఏళ్ళ కుర్రాడు ఛర్రున సైకిల్ తొక్కుతూ లారీని దాటబోయిన వాడిలా రోడ్డుమీది కొచ్చాడు. డ్రైవరు బ్రేక్ వేశాడు. కుర్రాడు బతికిపోయాడు. మళ్ళీ సైకిలెక్కి అంత వేగంగానూ వెళ్ళాడు. "వెనకాల ఏదో చప్పుడవు తోంది చూడు" అని వెంకట్రామయ్యగారు డ్రైవర్‌కి చెప్పాడు. డ్రైవర్ దిగాడు.

"బాబూ, బస్తాలు దింపేస్తున్నారు!" అని నెత్తీ నోరూ మొత్తు కుంటూ వొచ్చాడు. వెంకట్రామయ్యగారు "అదేంటీ! టార్పాలిన్ కట్టాం, తాళ్లు కట్టాం" అని కంగారుపడ్డారు. ఇద్దరం దిగాం—

టార్పాలిన్ కోసేశారు. తాళ్లు కోసేశారు. నాలుగు బస్తాలు నాలుగు దిక్కులకి నలుగురేసి చొప్పున మోసేశారు. మా వైపు చూడ కండాను- వెంకట్రామయ్యగారు ఏదో అనబోయాడు. "ఎలిపోండి బాబూ ఇక్కడుంటే పేణాలకే ముప్పు" అని ఓ భద్రబాహువు ఆయన మీద కొచ్చి ధాష్టీకంగా చెప్పాడు. ఆయన తెల్లబోయి నా వైపు చూశాడు.

నేను ఆ మనిషిని గుర్తుపట్టాను. డాక్టర్ సూర్యంగారికి పేషంట్లని సరఫరా చేసిన నాగులు.

నాకతను రెండు చేతుల్తో దండం పెట్టాడు. "తమరా బాబూ! ఎవురో పొరుగూ రోళ్ళనుకున్నారు మావోళ్లు. మమ్మల్నోక్కంట సూడండి బాబూ!" అన్నాడు పళ్లు బయటపెట్టి నవ్వుతూ.

"పదండి వీళ్లు నిరుపేదలు. ప్రభుత్వం, మనం వీళ్ళని ఓ కంట చూడాలి. లేకపోతే వాళ్ళు బతకలేరు, మనల్ని బతకనివ్వరు" అన్నాను వెంకట్రామయ్యగారి జెబ్బపట్టుకొని.

(3-2-79)

(17)